# సాక్షి
# కృష్ణాజిల్లా


శనివారం । 1 । మార్చి । 2025






## బుల్లితెర నటుల సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): బుల్లితెర నటి వర్షిణి, బిగ్‌బాస్ ఫేం ఫేహ్ రాజ్‌లు శుక్రవారం బెజవాడలో సందడి చేశారు. ఎంజీ రోడ్డులో విమెన్ వేర్ స్టోర్‌ను వారు ప్రారంభించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 529.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## కృష్ణా వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఉష



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఉష నియమితులయ్యారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

## న్యూస్‌రీల్

### అంకితభావంతో సేవలు చేస్తే గుర్తింపు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉద్యోగులు అంకితభావంతో అందించే సేవలే గుర్తింపు తెస్తాయని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలోని గణాంక విభాగంలో పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ చేసిన కొక్కిర నాగమణిని కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి జరిగే సాధారణ ప్రక్రియ అని, వారి అంకిత భావం, ప్రవర్తన ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ వై.శరత్ బాబు, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఎన్‌హెచ్ఎం, డీపీఎం డాక్టర్ నవీన్, బూచవరం, వెలగలేరు, కొండపల్లి, లింగాలుపాడులో పని చేసే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక అక్షరాస్యత అందరికీ అవసరం




కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యత అందరికీ అవసరమని కృష్ణా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సి.రవీంద్రరెడ్డి అన్నారు. ఆర్‌బీఐ సారథ్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు -2025 పురస్కరించుకుని గొడవర్రు జెడ్పీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు బ్యాంకింగ్ వ్యవస్థ-పొదుపు అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన టి.శారద, డి.ఉమాదేవి, కె.శ్రీదేవికి బహుమతులు అందించారు. రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ మహిళలు పొదుపుపై అవగాహన పెంచుకోవాలన్నారు. దీంతో ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. బ్యాంకింగ్ సేవలు వినియోగించుకుని ఆర్థిక వృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్ సునీల్ పాల్గొన్నారు.

### పశువులకు సకాలంలో టీకాలు వేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశువులకు అవసరమైన టీకాలను సకాలంలో అందించి, పూర్తిస్థాయిలో వ్యాధులను అరికట్టేందుకు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మార్చి 1 శనివారం నుంచి 30వ తేదీ వరకు పశువులకు గాలికుంటువ్యాధి, బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల వయసు దాటిన పశువులకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు, 4–8 నెలల వయసున్న పెయ్యదూడలకు బ్రుసెల్లోసిస్ నిరోధక టీకాలు పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉచితంగా రైతు వద్దే వేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### కేయూలో సైన్స్ దినోత్సవం



కోనేరుసెంటర్: సైన్స్‌లో రోజురోజుకు విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సుజాత, పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నయవంచన

## బడ్జెట్‌లో ఏ వర్గానికీ మేలు లేదు

- సూపర్‌సిక్స్‌పై నీలినీడలు
- అంకెల గారడీ, అరకొర నిధులు
- రైతులు, మహిళలు, యువతలో అసహనం
- బుడమేరు ఆధునికీకరణ ఊసే లేదు
- నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు అరకొర
- ఫిషింగ్ హార్బర్‌కు కేటాయింపుల్లేవు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్ర బడ్జెట్ సామాన్యుడిని నయవంచనకు గురిచేసింది. శాసన సభలో శుక్రవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా నిరాశ పరిచింది. అంకెల గారడీ, అరకొర నిధులతో మసిపూసి మారేడు కాయ చేసినట్లు బడ్జెట్ ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సూపర్‌సిక్స్ హామీలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. ప్రధానంగా రైతులు, యువత, మహిళల్లో అసహనం వ్యక్తమవుతోంది. నీటిపారుదల ప్రాజెక్టులకు అరకొరగానే నిధులు కేటాయించారు. అమరావతి నిర్మాణానికి అప్పు రూపంలో నిధులు తెచ్చారు తప్ప, బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయింపులు లేవని పెదవి విరుస్తున్నారు. మెట్రో రైలు, అవుటర్ రింగ్ రోడ్డు వంటి వాటికి నామ మాత్రంగా కూడా నిధులు కేటాయించలేదన్న భావన వ్యక్తమవుతోంది. వైద్యరంగాన్ని సైతం విస్మరించారు.

**బుడమేరు ఆధునికీకరణకు నిధులు సున్నా**

గత ఏడాది సెప్టెంబరులో వచ్చిన బుడమేరు వరదలకు బెజవాడలో సగం భాగం నీట మునిగింది. సీఎం చంద్రబాబు విజయవాడ.. బుడమేరు వరద ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకొంటున్నట్లు ప్రకటించారు. బుడమేరును ఆధునికీకరిస్తామని, ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. దానికనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో 'బుడమేరు'కు నిధులు కేటాయించకపోవడం గమనార్హం. బుడమేరు ప్రభావిత ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నీటిపారుదలకు నామమాత్రంగా నిధులు**

ఉమ్మడి కృష్ణా జిల్లాలో నీటి పారుదల రంగానికి బడ్జెట్‌లో నామ మాత్రంగా నిధులు కేటాయించారు. 2026 జూన్ నాటికి చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని గొప్పలు చెప్పారు. మైలవరం, తిరువూరు, నూజివీడులో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటితోపాటు, తాగు నీరు అందించే అతి ముఖ్యమైన ప్రాజెక్టు. ఈ పనులు పూర్తయ్యేందుకు రూ.4 వేల కోట్లకు పైగా నిధులు అవసరం. ప్రస్తుతం రూ.30 కోట్ల నిధులు కేటాయించి ఎలా ప్రాజెక్టును పూర్తి చేస్తారోనని నీటిపారుదల రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు.

కృష్ణా డెల్టాకు కేవలం రూ.400 కోట్ల నిధులను మాత్రమే కేటాయించారు. పులిచింతలకు రూ.16.37 కోట్లు ఇచ్చారు. పోర్టుకు అరకొరగానే నిధులు కేటాయించి, ప్రభుత్వం చిన్నచూపు చూసిందనే భావన వ్యక్తమవుతోంది. మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్‌కు నిధులు కేటాయించలేదు. గన్నవరం ఎయిర్‌పోర్టుకు రూ.29.88 కోట్లను కేటాయించారు. విజయవాడ కార్పొరేషన్‌కు కేవలం రూ.115.11 కోట్లను మాత్రమే నిధులు విదిల్చారు.



వరదల వేళ బుడమేరు ఉధృతి(ఫైల్)

**మహిళల నిట్టూర్పు**

కూటమి అధికారంలోకి వస్తే 18–59 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ఊదరగొట్టారు. బడ్జెట్‌లో దీని ఊసే లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 8,30,958 మంది, కృష్ణా జిల్లాలో 7,39, 202 మంది అర్హులైన మహిళలు ఉన్నారు. వీరంతా బాబు మాట నమ్మి నిండా మునిగామని నిట్టూరుస్తున్నారు.



బందరులో పోర్టు నిర్మాణ పనులు(ఫైల్)

**నో ష్యూరిటీ**

బాబు ఇచ్చిన పలు హామీలకు బడ్జెట్‌లో ష్యూరిటీ ఇవ్వలేదు. దీంతో సూపర్ సిక్స్ హామీలపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

**అన్నదాతకు అరకొరగా నిధులు**

ఉమ్మడి కృష్ణాజిల్లాలో రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో మాత్రం అరకొరగానే నిధులు కేటాయించడంతో రైతులు పెదవి విరుస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 1,41,726 మంది రైతులు, కృష్ణా జిల్లాలో 2.70 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. దీంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అంతంత మాత్రంగానే కేటాయింపులున్నాయి.

**నిరుద్యోగ భృతి నిల్**

ఎన్నికల వేళ కూటమి తాము అధికారం చేపట్టగానే వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని, లేదా నిరుద్యోగ భృతికింద నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో కేటాయింపులు ఇవ్వలేదు. ఎన్టీఆర్ జిల్లాలో 6,09,032 కుటుంబాలు, కృష్ణా జిల్లాలో 8 లక్షల కుటుంబాలకు తీవ్ర నిరాశే మిగిల్చింది.

**అరకొరగా తల్లికి వందనం**

ఎన్నికల హామీల్లో స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల చొప్పున తల్లికి వందనం కింద ఇస్తామని చెప్పారు. బడ్జెట్‌లో దీనికి అరకొరగా కేటాయించారు. ఎన్టీఆర్ జిల్లాలో 3.35 లక్షల మంది, కృష్ణా జిల్లాలో 2.42 మంది తల్లులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఫిషింగ్ హార్బర్ పనులు(ఫైల్)

**ఉచిత బస్సు రాలేదు**

ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ కూటమి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ హామీ ఇచ్చినా బడ్జెట్‌లో దీని ఊసే లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 9.70లక్షల మంది, కృష్ణా జిల్లాలో 9 లక్షల మంది మహిళలు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. బాబు ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

**వచ్చే ఏడాదైనా భరోసా ఇస్తారా**



అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రైతుకు రూ.20వేలు ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది ఖరీఫ్, రబీ సాగుకు పథకం అమలు చేయలేదు. ఈ బడ్జెట్ చూస్తే వచ్చే ఏడాది కూడా అమలయ్యేలా కనిపించడంలేదు. వరదలతో వరి పంట, రేటు లేక మిర్చి, టామాటా పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. నష్టపరిహారం ఇవ్వాలి. మా ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు, కవులూరు

**ఉద్యోగుల హామీపై స్పష్టత లేదు**



రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగుల హామీలపై స్పష్టత లేదు. గ్రాట్యూటీ, ప్రావిడెండ్ ఫండ్ ఎన్నికల ముందు వరకు గత ప్రభుత్వం చెల్లింపులు చేసింది. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం ఇవ్వలేదు. రిటైర్డ్ ఉద్యోగులకు సరెండర్ లీవ్ ఫండ్ ఇవ్వలేదు. పెద్ద ఎత్తున ఉద్యోగాలు సృష్టిస్తామని హామీ ఇచ్చారు. వీటిరి బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

–హమ్మద్ సిలార్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ తహసీల్దార్

**సంపద సృష్టి చూపలేదు**



గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడానికి సంపద సృష్టిస్తామని చెప్పారు. మరి కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఎలా సృష్టిస్తారో చూపించలేదు. బడ్జెట్‌లో హామీలు నెరవేర్చేందుకు పెద్దగా నిధులు కేటాయించలేదు. ఇది ప్రజలను మోసం చేసే బడ్జెట్. ప్రభుత్వం తీరును ప్రజలు గమనిస్తున్నారు.

– మండలి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

# 'ఇంటర్' పరీక్షలకు సన్నద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- కృష్ణాలో రాయనున్న 45,430మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి

గుడ్లవల్లేరు/చిలకలపూడి(మచిలీపట్నం): ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుంచి మొదలై 20వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తుండగా...విద్యార్థుల కోసం ఏర్పాట్లు చేశారు. ఓఎమ్మార్, ఎన్ఆర్ షీట్లు ఇతర సామగ్రి ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి.

**జిల్లాలో 45,430 విద్యార్థులు...**

కృష్ణా జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ, 55 ప్రైవేట్ కళాశాలలతో కలిపి మొత్తం 63 ఇంటర్మీడియెట్ కాలేజీలు ఉన్నాయి. 45,430 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరానికి 24,557 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. ద్వితీయ సంవత్సరానికి 20,873 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరి కోసం జిల్లాలో 63పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పరీక్ష పత్రాలను భద్రపరచారు.

**పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు**

విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో ఫర్నిచర్ ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే.. సమీపంలోని మరొక కళాశాల నుంచి ఫర్నిచర్ సమకూరుస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని సంబంధితాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతి గదిలో ఫ్యాన్ సౌకర్యం ఉండేలా అమర్చారు

**పరీక్షల నిర్వహణపై డేగ కన్ను**

పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. తనిఖీలకు సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమించారు. ఇన్విజలేటర్లను, స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేయడానికి సమావేశాలను కూడా నిర్వహించారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

**పకడ్బందీగా ఏర్పాట్లు**

ఉదయం తొమ్మిది గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించం. ఎవరైనా ఫీజు సాకుతో హాల్ టికెట్లు ఇవ్వకపోతే మా దృష్టికి తీసుకురండి. జిల్లాలో 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాం. ఆయా కేంద్రాలకు మెటీరియల్ కూడా పంపించాం. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆయా రూట్లలో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. స్క్వాడ్ బృందాలను నియమించాం. – సాల్మన్‌రాజు, ఇంటర్మీడియెట్ ప్రాంతీయ అధికారి

# మురిపించిన స్పటికేశ్వరుడు

- 1008 స్పటిక మాలలతో విశేష అభిషేకం
- ముగిసిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

సంగమేశ్వరం(నాగాయలంక): సంగమేశ్వరుడే.. స్పటికేశ్వరుడై భక్తులను మురిపించాడు. సంగమేశ్వరంలోని శ్రీగంగాపార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యాన నాలుగు రోజులుగా కొనసాగిన ఉత్సవాల్లో 1008 స్పటిక మాలలతో చేసిన విశేష అభిషేకం, పూజ, ఆధ్యాత్మిక సౌరభంగా నిలిచింది. బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు గురువారం రాత్రి అర్చకులు కొల్లిపర తిరుమల సాయిభార్గవ్, కొల్లిపర సుబ్బారావు ఆధ్వర్యంలో 1008 స్పటిక మాలలతో అభిషేకం చేశారు. అనంతరం సంగమేశ్వరం వీధుల్లో స్వామివారి రథోత్సవం శోభాయమానంగా జరిగింది. ఉత్సవంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం పార్వతీసమేత సంగమేశ్వర స్వామివారి సముద్ర విహార ఊరేగింపు, అనంతరం గ్రామంలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, తనయుడు వెంకట్రామ్, సాయిప్రియ ఇతర కుటుంబ సభ్యులు అర్చకులు, సాయిభార్గవ్ బ్రహ్మత్వంలో పూజ జరిపి వసంతోత్సవం ఆరంభించారు. తర్వాత పూర్ణాహుతి, పవళింపుసేవ ఉత్సవాలకు స్వస్తి పలికారు.



ఆలయంలో1008 స్పటిక మాలలతో అభిషిక్తుడైన సంగమేశ్వరుడు

## పెన్షన్లకు రూ. 98.20 కోట్లు విడుదల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో మార్చి 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 2,29,913 మంది పెన్షనర్లకు పంపిణీ చేయడానికి రూ. 98.20 కోట్లు విడుదల చేశామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం ఉదయం 7 గంటలకు పంపిణీ ప్రారంభించాలన్నారు. రెండో తేదీ ఆదివారం కావడంతో పెన్షన్ల పంపిణీ ప్రక్రియను మూడో తేదీ నాటికి 100 శాతం పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పెన్షన్ పంపిణీ చేయాల్సి వస్తే అందుకు తగిన కారణాన్ని మొబైల్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బందరు జీజీహెచ్‌లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

**కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ**

చిలకలపూడి(మచిలీపట్నం): కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు రూ. 45 లక్షలతో మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. వైద్యాధికారులు ప్రభుత్వాస్పత్రిలో పరిస్థితులను వివరిస్తూ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా అదనంగా మంచాలు, ఎక్స్‌రే వంటి వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్‌లో బెడ్లు, టేబుళ్లు, ఐసీయూ బెడ్లు వంటివి అవసరం ఉందని కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రూ. 20 లక్షలతో ఎక్స్‌రే సీఆర్ సిస్టమ్, ఇతర పరికరాల కొనుగోలుకు మరో రూ. 25 లక్షలు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. ఆశాలత, డీసీహెచ్ఎస్ ఎం. జయకుమార్, సీపీవో గణేష్‌కృష్ణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

## సహకార రంగం బలోపేతానికి చర్యలు

**డీసీవో చంద్రశేఖరరెడ్డి**

చిలకలపూడి(మచిలీపట్నం): సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా సహకార అధికారి కె. చంద్రశేఖరరెడ్డి అన్నారు. కేడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పీఏసీఎస్ సీఈవోలతో సమావేశాన్ని నిర్వహించారు. డీసీవో మాట్లాడుతూ 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించారన్నారు. సహకార సంస్థలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయనే అంశంపై ఈ ఏడాది సహకార రంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చేలా ప్రణాళికను రూపొందిస్తున్నారన్నారు. స్థిర అభివృద్ధి లక్ష్యాలు 2030 నాటికి అందుకోవాలంటే ప్రపంచ దేశాలు సహకార రంగంలో పురోగమిస్తేనే సాధ్యమవుతుందని ఐక్య రాజ్యసమితి గుర్తించటం అభినందనీయమన్నారు. జిల్లాలోని పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ చివరిదశకు చేరుకుందని ఈ నెలాఖరు నాటికి నూరుశాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీసీవో చంద్రశేఖరరెడ్డి, కేడీసీసీ సీఈవో శ్యామ్‌మనోహర్ తదితరులు

**మెరుగైన సేవలే లక్ష్యం..**

కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్ మాట్లాడుతూ కంప్యూటరీకరణ ప్రక్రియ ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి ఫణికుమార్ మాట్లాడుతూ కంప్యూటరీకరణ చేస్తే ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించవచ్చునన్నారు. జనరల్ మేనేజర్ బీఎల్ చంద్రశేఖర్, కేబీ రంగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో–ఆపరేటివ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## ఘనంగా అక్కినేని విగ్రహావిష్కరణ

గుడివాడ టౌన్: ప్రముఖ సినీ నటుడు, గుడివాడ ప్రాంతవాసి అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి హైస్కూల్ ప్రాంగణంలో అక్కినేని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ జరిగింది. అక్కినేని మనుమడు సుమంత్ ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ తమ తాత అక్కినేని నాగేశ్వరరావుకు విశ్వభారతి అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణకు మంచి స్నేహం ఉండేదన్నారు. తాత మృతి చెంది ఏళ్లు అయినా కూడా ఆ బంధం తమ కుటుంబ సభ్యులతో ఇంకా కొనసాగుతుందని చెప్పారు. ఆయనను గుర్తు చేసుకుంటూ ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీమన్నారాయణ కుటుంబ సభ్యులకు, విశ్వభారతి యాజమాన్యానికి తాను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో నాగ సుశీల, సుప్రియ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించిన అక్కినేని కుటుంబసభ్యులు